ప్రజాశక్తి
గురువారం 13 జులై 2023 5 అనంతపురం

24/7 మద్యం..!

ఉదయం 7గంటలకే తెరుచుకుంటున్న బార్లు

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

వైసిపి అధికారంలోకి వచ్చాక కొత్త మద్యం పాలసీని తీసుకుని వచ్చి, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. దీంతో ఎక్సైజ్ అధికారులకు గతంలో ప్రయివేటు మద్యం షాపుల నుంచి వచ్చే మామూళ్లకు బ్రేక్ పడింది. మద్యం షాపులన్నీ ప్రభుత్వమే నిర్వహిస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు బార్లను ఆదాయ వనరులుగా మార్చుకున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 18 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. వీటిలో అనంతపురం నగరంలోనే 10 ఉన్నాయి . నిబంధనల మేరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 12 వరకు మద్యం అమ్మకాలు నిర్వహించాలి. కానీ బార్లన్నీ తెల్లవారుజామున 5 గంటలకే అధికారికంగా తెరుచుకుంటున్నాయి. దీన్ని నివారించాల్సిన ఎక్సైజ్ అధికారులు కనీసం ఆ వైపునకు తొంగి చూడటం లేదంటే మామూళ్లు ఏ స్థాయిలో అందుతున్నాయో ఇట్టే అర్థమవుతోంది.

ఇష్టారాజ్యంగా మద్యం ధరలు

సాధారణంగా ప్రభుత్వ మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మకాలు నిర్వహిస్తారు. కానీ బార్లలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 నుంచి రూ.150 వరకూ బ్రాండ్లను బట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపైనా ఎక్సైజ్ అధికారుల చర్యలు శూన్యమనే చెప్పాలి. దీనికి తోడు రాత్రి 12 గంటలు దాటిన తర్వాత బార్ల గేట్ల వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డుల ద్వారా రాత్రంతా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉదయం 5 గంటలకే అధికారికంగా బార్లు బార్లా తెరుస్తున్నా ఎక్సైజ్ అధికారులకు కనిపించడం లేదంటే అందులోని మతలబు ఏమిటో అధికారులకే తెలియాలి.

బార్లను పరిశీలిస్తాం

బార్లను నిబంధనల మేరకే నిర్వహించాలి. ప్రభుత్వం సూచించిన సమయంలో మాత్రమే విక్రయాలు జరపాలి. అలాకాకుండా ముందుగా తెరిచినా, సమయం దాటిన తరువాత తెరిచి ఉంచినా చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బార్లపై చర్యలు తీసుకుంటాం.

కుమరేశ్వరన్,
ఎక్సైజ్ సూపరింటెండెంట్.

ప్రత్యామ్నాయ అభివృద్ధిలో దేశానికే మోడల్ కేరళ

◆ సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి ◆ 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి- కేరళ ప్రభుత్వ నమూనా' పై ముఖాముఖి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి,
అనంతపురం కలెక్టరేట్

కేరళ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ప్రత్యేకమైన ప్రణాళికతో వామపక్ష పార్టీలు అభివృద్ధి పథంలో నడిపించాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పరిషత్ సమావేశం హాలులో 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి- కేరళ ప్రభుత్వ నమూనా' అన్న అంశంపై సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.ఎ.బేబి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన అంగ్లంలో చేసిన ప్రసంగాన్ని మాజీ ఎమ్మెల్సి డాక్టర్ గేయనంద్ తెలుగులోకి అనువదించారు. దేశంలో వామపక్ష పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు కేరళలో చోటు చేసుకున్న పరిణామాలను వివరించారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావం నుంచి రాష్ట్రంపై వామపక్ష పార్టీల ప్రభావం ఏ విధంగా ఉంటూ వచ్చిందని వివరించడమే కాకుండా, ఆ ప్రభావం మూలంగా ప్రజలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుతూ వచ్చిందన్నది తెలిపారు. పెట్టుబడిదారీ దేశంలోనే కేరళలో ఏ మేరకు ప్రత్యామ్నయ విధానాలు అవలంభించగలిగారన్నది చెప్పారు. సంపద పున:పంపిణీని కొంత వరకైనా చేపట్టడం ద్వారా వేతనాల్లో ఇతర రాష్ట్రాల్లో కంటే అధికంగా ఉన్నాయన్నది తెలియజేశారు. అందుకే వలస కార్మికులు ఎక్కువగా ఈ రాష్ట్రానికి వస్తూ ఉంటారన్నారు. విద్యా, ఆరోగ్యానికే కాకుండా గ్రామ స్థాయి నుంచి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం, వాటిని అమలు చేయడం జరుగుతోందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రణాళిక సంఘాన్నే రద్దు చేసినప్పటికీ కేరళ రాష్ట్రంలో ప్రణాళిక మండలి ఉందని తెలిపారు. ఆర్థికవేత్తలను వైస్ ఛైర్మన్‌గా పెట్టి ఈ ప్రణాళికలను అమలు చేయడం ద్వారా ప్రజలకు అవసరమైన అభివృద్ధి సాధ్యమవుతోందని వివరించారు. స్థానిక సంస్థలకు బడ్జెట్‌లో 35 నుంచి 40 శాతం నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రణాళిక పైనుంచి కాకుండా దిగువ నుంచి రావడం వాటిని అమలు చేయడం ద్వారా ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేందుకు వీలుంటుందన్నారు. అక్షరాస్యతకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఈ కాలంలో ఏడు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారన్నారు. ఆంగ్ల విద్య ప్రోత్సహం కోసం ఆరు వేల ఉపాధ్యయ పోస్టులను భర్తీ చేసినట్లు చెప్పారు. సామాజిక భద్రత విషయంలోనూ చర్యలు చేపడుతోందన్నారు. కేరళ రాష్ట్రంలో 85 లక్షల కుటుంబాలుంటే 65 లక్షల కుటుంబాలకు సామాజిక పింఛను సౌకర్యం కల్పిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన పేపరు మిల్లు, విమానాశ్రయాలను ప్రయివేటుకు అప్పగించే ప్రయత్నం కేంద్రం చేస్తే, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి బాటలో పయనింపజేస్తోందని గుర్తు చేశారు. కేరళ రాష్ట్రంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎక్కువనే చెప్పారు. ప్రధానంగా యువత కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలు అమోఘమన్నారు.

ముఖాముఖిలో మాట్లాడుతున్న ఎం.ఎ.బేబి

నేడు బహిరంగ సభ

అనంతపురం నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద బహిరంగ సభను సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 5-30 గంటలకు జరిగే ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు ప్రధాన వక్తలుగా హాజరుకానున్నట్టు ఆయన తెలిపారు. ఈ సభకు పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా పలువురు ఎం.ఎ.బేబిని కేరళ అభివృద్ధిపై పలు ప్రశ్నలు వేశారు. ఇందుకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న పురప్రముఖులు

కేరళ రాష్ట్రంలో కూడా అసమానతలు ఉన్నాయి.? ఎందుకు.?
మానవ హక్కుల వేదిక చంద్రశేఖర్

దేశంలో పోలిస్తే కేరళలో అసమానతలు చాలా తక్కువ. అయినప్పటికీ వాటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాలనలో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేస్తున్నాం. కమిటీలు వేసి ప్రజలకు ఏమి కావాలో, ఏమి చేస్తే బాగుంటుందో వారి ఆలోచనలు సేకరించి అసమానతలు రూపుమాపడానికి చర్యలు తీసుకుంటున్నాం.

సిపిఎస్‌ను కేరళ ప్రభుత్వం రద్దు చేస్తుందా..?
యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయడానికి దేశంలో అనేక రాష్ట్రాలు నిర్ణయించాయి. అందులో కేరళ కూడా ఉంది. అయితే అమలు చేయడానికి ప్రయోగాత్మక సమస్యలు ఉన్నాయి. వాటిని అధిగమించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

కేరళ ప్రభుత్వం ఎన్నికైన రెండు ఏళ్లకే కూల్చివేశారు.? ఎందుకు.?
విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్

దేశాన్ని కాంగ్రెస్ అత్యధిక కాలం పరిపాలన చేసింది. ఆ తరువాత బిజెపి ప్రభుత్వం పరిపాలన చేశాయి. ఆ మేరకే ఆయా రాష్ట్రాల్లో ఆపార్టీ ప్రభుత్వాల ఏర్పాటుకే పని చేశాయి. ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టుల ప్రభుత్వం కేరళలో ఏర్పాటైంది. కమ్యూనిస్టు పార్టీ లేకుండా చేయడానికి సిఐఎ కుట్ర చేసి కూల్చి వేసేలా చేశాయి. ఇండియన్ అంబాజిటర్ తన పుస్తకం రాయడంతో బహిర్గతమైంది.

కేరళలో కూడా రైతులు ఆత్మహత్యలు జరుగుతున్నాయి.?
ప్రజా సంఘాల నాయకుడు హరి

కేరళ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణం కేంద్ర ప్రభుత్వ పథకాలే. కొన్ని పంటలకు కేంద్ర పథకాలు అనుసంధానంగా ఉంటాయి. పండించిన పంటలను కొనుగోలు చేయకపోవడం, రాష్ట్ర రైతుల పంటలను కాదని ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయడం వంటి మార్కెట్ సమస్యలు తలెత్తి ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు ఆత్మహత్యలు చాలా తక్కువ శాతమే జరుగుతున్నాయి. వాటిపై కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కలిగిస్తోంది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మొదలైన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

◆ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎం.ఎ.బేబి హాజరు

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధవారం నుంచి అనంతపురం నగరంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బుధవారం నాడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం నగరంలోని రేడియెంట్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎం.ఎ.బేబిలు ముఖ్య అతిథలుగా హాజరయ్యారు. నేడు, రేపు రాష్ట్ర కమిటీ సభ్యులందరూ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొననున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీ నాయకులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు ఉపయోగం: కలెక్టర్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ఉపయోగం చేకూరుతుందని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. బుధవారం నాడు మండల పరిధిలోని పెద్దపప్పూరు గ్రామం 2వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజలకు అవసరమైన కులం, ఆదాయం, నివాసం, అడంగల్, పింఛన్, రేషన్ కార్డు, వితంతువు, కుటుంబ సభ్యుల పేర్లు విభజన, ఆధార్‌లింక్, కౌలురైతులకు సిసిఆర్సి కార్డులు తదితర ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి సర్వీసు ఛార్జీలు లేకుండా ఉచితంగా సులభతరంగా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పరిష్కారం కాని సమస్యను చెప్పేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సేవలకు సంబంధించి 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయవచ్చునని తెలిపారు. అనంతరం గ్రామంలో అర్హులై మిగిలిపోయిన కుటుంబాలకు సంబంధించి 144 వివిధ రకాల సర్టిఫికెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. జగన్న సురక్ష కార్యక్రమం అనంతరం కలెక్టర్ డిఇఒ సాయిరాంతో కలిసి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు బాగా చదువుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఓబులమ్మ, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీనాయక్, స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రమోహన్‌రెడ్డిని అభినందిస్తున్న విసి తదితరులు

ఈసీఈ విభాగం అధిపతిగా డా॥ఎస్.చంద్రమోహన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతిగా డాక్టర్ ఎస్.చంద్రమోహన్ రెడ్డి బుధవారం భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లు తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించారన్నారు. ఉపకులపతి, రెక్టార్, రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపాల్ నేతత్వంలో ఇంజినీరింగ్ కళాశాల అభివద్ధికి తన వంతు కషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి రంగజనార్ధన, వర్శిటీ అకడమిక్ డైరెక్టర్ సుమలత, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణక్రాంతి, డాక్టర్ యస్.చంద్రమోహన్‌రెడ్డిని అభినందించారు. ఈకార్యక్రమంలో ఈసీఈ విభాగం బోధనా సిబ్బంది డాక్టర్ మమత, విష్ణు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

అనంతపురం : సిపిఐ సీనియర్ నాయకులు అనంతపురం జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ పి.వెంగమనాయుడు 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుల ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు వికె.రంగారెడ్డి, ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, యు.రామచంద్రారెడ్డి, బి.రామ్మోహన్, ఎస్.తిరుపతయ్య, పి.నాగరాజు, తలారి రామాంజనేయులు, రేపటి రామాంజనేయులు, వెంగమనాయుడు తనయుడు పి అజయ్ కుమార్, అల్లుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పేదల పక్షాన జీవితాంతం పనిచేసిన ఘనత కామ్రేడ్ వెంగమ నాయుడు కు దక్కుతుందని వారు కొనియాడారు.

అన్నదానం చేస్తున్న మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు

కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రం పొందాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

ప్రతి రైతు పిఎం కిసాన్ ఈకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని, కౌలు రైతులు పంట సాగు హక్కుపత్రం పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని ఆవులదట్ల, 74-ఉడేగోళం రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బికె)ను సందర్శించారు. అలాగే పటణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న వైఎసఆర్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. 74-ఉడేగోళం ఆర్‌బికెలో సిబ్బందితో మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి వారికి పంట సాగుదారుని హక్కు పత్రం అందించాలన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుకు రూ. 13,500 రైతు భరోసా ఇస్తుందని, ఇది రైతుకు ఆసరాగా ఉంటుందన్నారు. వేరుశనగ విత్తనంతో పాటు, బ్యాంకులో రుణం తీసుకునేందుకు పంట సాగుదారుని హక్కు పత్రం ఉపయోగపడుతుందన్నారు. ఆర్‌బికె సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి సర్వే నంబర్‌ను సందర్శించి ఈ పంట నమోదు చేయాలని సూచించారు. చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులు సాగు చేసిన చిరుధాన్యాలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందనా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆమె ఆర్‌బికెలో రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆమె వెంట వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్, మండల వ్యవసాయ అధికారులు మహేంద్ర, అహ్మద్‌బాషా, నిర్మల్‌కుమార్, ఆర్‌బికె సిబ్బంది ఉన్నారు.

1100 మందికి సిఎం సహాయ నిధి

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగేళ్లలో వివిధ సమస్యలతో ఇబ్బందులు పడిన 1100 మందిని సిఎం సహాయ నిధి ద్వారా ఆదుకున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు 30 ఏళ్లుగా తాడిపత్రిలో సిఎం సహాయ నిధిని వారి ముఖ్య అనుచరులకు మాత్రమే వర్తింపజేసుకొన్నారని విమర్శించారు. ఈ నాలుగేళ్లలో తాము 1100 మందికి సిఎం సహాయ నిధి అందించామన్నారు. ప్రజలకు అవసరమైన పథకాలు, సర్టిఫికెట్లకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించడానికి ప్రభుత్వం ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సర్వే నిర్వహిస్తోందన్నారు. సమస్యలను వంద శాతం పరిష్కరించేందుకు ప్రతి సచివాలయంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు సత్వర సేవలు అందించడంతో పాటు, సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలనే దృఢ సంకల్పంతో జగన్ సారథ్యంలోని వైసిపి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి, తహశీల్దార్ మునివేలు, నాయకులు ఫయాజ్‌బాషా, ఓబులేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, మధు, తదితరు లు పాల్గొన్నారు.

గన్నెవారిపల్లిలో ఘర్షణ

◆ కట్టెలు, కత్తులతో వైసిపి, టిడిపి నేతల పరస్పర దాడులు
◆ పంచాయతీలో అక్రమాలపై అధికారులకు ఫిర్యాదులు
◆ ఎంపీటీసీ, వైస్ సర్పంచి మధ్య వైరం
◆ ఇరువర్గాలపై కేసులు నమోదు

ఘర్షణలో గాయపడిన గన్నెవారిపల్లి టిడిపి, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి గ్రామంలో టిడిపి, వైసిపి నేతల మధ్య మంగళవారంర రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో టిడిపికి చెందిన నలుగురు కార్యకర్తలు, వైసీపీకి చెందిన ముగ్గురు కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలో మేజర్ పంచాయతీ అయిన గన్నెవారిపల్లిని ఇటీవల రెండుగా విభజించారు. ఇక్కడ పంచాయతీ ఎన్నికల్లో టిడిపి సర్పంచిగా, జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఎంపిటిసి అభ్యర్థి విజయం సాధించారు. టిడిపి, వైసిపి రెండు పార్టీలు బలంగా ఉండడంతో ముందునుంచి ఇక్కడ ఈ నేతల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గతంలో పంచాయతీ సర్పంచి ఉమామహేష్ ఆధ్వర్యంలో అండర్ డ్రైయినేజీ కోసం ఇంటింటి నుంచి డబ్బులు వసూలు చేశారని, దీంతో పాటు మరికొన్ని అభివద్ధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని వైసీపీ ఎంపీటీసీ రవికుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న అధికారులు విచారణకు వచ్చి అక్రమాలు జరిగినట్టు నిర్ధారించారు. అప్పటినుంచి ఘర్షణ వాతావరణం కొనసాగుతూ ఉంది. గన్నెవారిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి సర్పంచి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ జూలై 10న ఎంపీటీసీ రవికుమార్ అనంతపురం కలెక్టర్ కార్యాలయం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ముందు నుంచి కొనసాగుతున్న ఇరువర్గాల మధ్య ఉన్న వైరాలు ఈ ఫిర్యాదులతో తీవ్ర రూపం దాల్చాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో టిడిపి వార్డు మెంబర్ గోపాల్‌ను కొందరు వైసీపీ నాయకులు కొట్టారని బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందిస్తుండగా పరామర్శించడానికి వెళ్లిన ఆ గ్రామ వైస్ సర్పంచి, టిడిపి నాయకుడు చింబిలి వెంకట రమణ, రాంబాబు, అమీర్ బాషాలను ఆసుపత్రి ఆవరణంలో వైసిపి నాయకులు కట్టెలు, కత్తులతో కొట్టారని బాధితులు తెలియజేశారు. ఈ ఘర్షణలో వైసీపీ నాయకులు రవికుమార్, వీర, వినయ్‌లు కూడా గాయాలయ్యాయని వైసిపి నాయకులు తెలిపారు. సమాచారం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం ఇరువర్గాల ఫిర్యాదు మేరకు టిడిపికి చెందిన నలుగురు, వైసిపికి చెందిన ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఘర్షణ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు గన్నెవారిపల్లిలో ముందస్తుగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

బాధితులకు జెసి అస్మిత్‌రెడ్డి పరామర్శ

వైసిపి నాయకుల దాడిలో గాయపడి అనంతపురం నగరంలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వైస్ సర్పంచి చింబిలి రమణను బుధవారం తాడిపత్రి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్ రెడ్డి, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పరామర్శించారు. అనంతరం అస్మిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసిపి నాయకులు తాడిపత్రి మండల పరిధిలోని గన్నెవారిపల్లి పంచాయతీలో అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయడం తప్పా అని ప్రశ్నించారు. చేతనైతే తప్పు చేయలేదని నిరూపించుకోవాలని హితవు పలికారు. దాడులకు పాల్పడడమే మీ మగతనమా అని ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ప్రశ్నించారు. ఇలాంటి దాడులకు భయపడమని, ఇకపై ఇంతకంటే బలంగా పోరాడుతామని హెచ్చరించారు.

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుత్తి

పేద ప్రజల అభ్యున్నతే ప్రభుద్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పూలకుంట, పి.ఎర్రగుడి గ్రామాల్లో బుధవారం ఎంపిపి జి.విశాలాక్షి, సర్పంచులు ఎన్.సుమలత, ఎం.పాపన్న ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజల కు వివరించారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సిఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సునీల్‌యాదవ్, సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, కోనా మురళీధర్ రెడ్డి, నాయకులు వై.సుభాష్‌రెడ్డి, బి.రమేష్‌రెడ్డి, గురుప్రసాద్, ప్రవీణ్‌కుమార్, ఎన్.రాజశేఖర్, ఎం.రంగస్వామి, ఎ.దస్తగిరి, లాలూనాయక్, మల్లికార్జున, అబ్దుల్‌వహాబ్, కౌన్సిలర్లు ఫారుక్, వాల్మీకి శివ, వరద, రమణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎడిఎ రవి

చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి-గార్లదిన్నె

చిరుధాన్యాలు సాగు చేస్తే ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుందని అనంతపురం ఎడిఎ రవి రైతులకు సూచిం చారు. మండల పరిధిలోని సిరివరం గ్రామంలో రైతు మలిరెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను బుధవారం ఆయన ఎఒ సోమశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలు సాగు చేయాలని, వీటి సాగు వల్ల భూమిలో పోషక విలువలు సమానంగా తీసుకుంటాయన్నారు. అలాగే జూన్‌లో విత్తిన వేరుశనగ పంటకు జిప్సం ఎకరాకు 2కిలోలు అంటే 4 బ్యాగులు వేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో వేరుశనగ -266, కంది-145, మొక్కజొన్న-51, ఆముదం -501, పత్తి-85 ఎకరా ల్లో సాగు చేశారన్నారు. వర్షాలు కురిసిన వెంటనే మిగిలిన రైతులు పంట సాగుకు సిద్ధంగా ఉండాలని సూచించా రు. ఆయన వెంట విహెచ్ఎ గంపరాజు, రైతులు ఉన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన సదస్సు

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డి పల్లి, కుమ్మనమల, వెల్లుట్ల, మడుగుపల్లి సచివాల యాలకు సంబంధించి బుధవారం ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా వాలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి 11 రకాల సేవలను ఉచితం గా అందజేస్తారని తెలిపా రు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గూగూడులో తలనీలాలకు వేలం

నార్పల : మండల పరిధిలోని గూగూ డు కుళ్లాయిస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునే హక్కు పొందేందుకు గురువారం(నేడు) ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శోభ, ఆలయ కమిటీ చైర్మన్ శివ శంకర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ. లక్ష ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం పాట దేవాదాయ శాఖ నిబంధనలకు లోబడి నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్‌బికెల తనిఖీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అసిస్టెంట్ ఇంజనీర్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని వడియంపేట, రోటరీపురం రైతు భరోసా కేంద్రా లను విజిలెన్స్ అధికారులు సందర్శించి విత్తన, ఎరువుల పంపిణీ రికార్డులతో పాటు ఆర్‌బికెకు పంపిణీ చేసిన వస్తువులు, పోస్టర్లు, ఇతర సామగ్రి ని పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటరమణ మాట్లాడుతూ ఆర్‌బికే సిబ్బంది రైతులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించా లని, వారికి అర్థమయ్యేటట్లు పథకాల గురించి వివరించాలని, ఇక్కడ లభించే ఎరువుల గురించి తెలియజేయాలని ఆదేశించారు. వారి వెంట ఎంపిడిఒ విజయభాస్కర్, ఇఒఆర్‌డి దామోదర్‌నాయుడు, ఎఒ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆర్‌బికె ఇన్‌ఛార్జులు శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల ర్యాలీ

బొమ్మనహాల్ : వేతనాలు ఇవ్వాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు బుధవారం ఎఐటి యుసి ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం, ర్యాలీ చేపట్టారు. ఈ సం దర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 7 నెలల నుంచి బకాయిపడ్డ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, అవసరమైన పనిముట్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇఒఆర్‌డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమం లో మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం తగదు

బుక్కరాయసముద్రం : ప్రజా సమస్యల పట్ల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హితవు పలికారు. ఎస్సీ నియోజకవర్గంలో రెడ్డి, నాయుడుల పెత్తనం పెరుగుతోంది. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పూలే, అంబేద్కర్ భావజాలంతో చైతన్య పరచడమే లక్ష్యంగా ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రేకలకుంట రామాంజనేయులు, నారాయణ స్వామి, రామకృష్ణ, లక్ష్మయ్య, ప్రతాప్, రాజన్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విజినరీ లీడర్ సిఎం జగన్

అనంతపురం : సిఎం జగన్ విజినరీ లీడర్ అని వైసిపి నాయకులు పోతుల నాగరాజు తెలిపారు. నగరం లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా అధ్యక్షులు పైలా నర్సిం హయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎడిసిసి ఛైర్‌పర్సన్ లిఖితతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. సిఎం జగన్ బిసిల అభ్యున్నతికి కృషి చేయడం తో పాటు సామాజిక న్యాయం చేస్తుండడంతోనే వైసిపిలో చేరానన్నారు. సమావేశంలో నాయకులు రమేష్‌రెడ్డి, ధనుంజయ యాదవ్ పాల్గొన్నారు.

చక్రపాణి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు : ఆత్మకూరులో బుధవారం వైసిపి నాయకులు సుబ్బర చక్రపాణి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సుబ్బర చక్రపాణి మృతదేహా న్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఆర్‌బికెను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా సిఎం జగన్ రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బికె) ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. వజ్రకరూరు మండల పరిధిలోని గంజిగుంట గ్రామంలో రూ. 21.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌బికెను బుధ వారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగన్ ప్రభుత్వం నాలుగేళ్లుగా ముందస్తుగా సాగు పెట్టుబ డి, సబ్సిడీపై విత్తనకాయలు, ఎరువులు, డ్రిప్పులు, ట్రాక్టర్లు, తదితర వాటిని రైతులకు అందజేస్తుంద న్నారు. అలాగే వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆర్‌బికె సిబ్బంది రైతులను ఎప్పటికప్పుడు అప్రమ త్తం చేయడంతో పాటు వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు, సబ్సిడీ, బీమా వంటివి అందేలా చూస్తు న్నారన్నారు. అనంతరం ఆయన గంజికుంట-ఉరవకొండ, తట్రగల్లు-ఉరవకొండ తారు రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ లలిత, తహశీల్దార్ అనిల్, మండల ఇంజనీర్ మధు భూషణ్, ఎంఇఒ ఎర్రిస్వామి, వైసిపి నాయకులు జయేంద్రారెడ్డి, సత్య, మధుసూదన్‌రెడ్డి, రామచంద్ర, పాపన్న, రామాంజనేయులు, గురుప్రసాద్, తిప్పన్న, ఏసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

విద్యతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు అని భావించిన సిఎం జగన్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా వజ్రకరూరు మండల పరిధిలోని తట్రగల్లు గ్రామం లో ఉన్న కస్తూరిబా బాలికల విద్యాలయలో అత్యుత్త మ మార్కులు సాధించిన కె.దివ్య, చంద్రకళాబాయ్, పి.ప్రసన్న, నజుమాలకు మెడల్స్, ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమం లో ఎస్ఒ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, సర్పంచి, ఎంఈఓ ఎర్రిస్వామి, ఎంపిడిఒ విజయలలిత, తహశీల్దార్ అనిల్, జయేంద్రరెడ్డి, వైసిపి నాయకులు, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు

ఎమ్మెల్సీ సహకారంతోనే సాయం

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కృషి వల్లే తనకు ప్రభుత్వం నుంచి రూ. 2 లక్షలు అందాయని ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామానికి చెందిన కల్పన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు.

దొంగల ముఠా అరెస్టు

దొంగల వివరాలు వెల్లడిస్తున్న సిఐ నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను బుక్కరాయసముద్రం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం సిఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరా లు వెల్లడించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రా మంలో ఈ నెల 9వ తేదీ అమ్మవారి గుడిలో ముఖ కవచం, అలాగే శింగనమల మండలంలోని శ్రీపురం పెద్దమ్మ ఆలయంలో రెండు తాళిబొట్లు, చెవి రింగు చోరీకి గురైనట్లు అందిన ఫిర్యాదుల మేర కు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అందిన సమాచారం మేరకు కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న అనంతసాగర్ కాలనీ-1 వద్ద దొంగల ముఠాను చేశారు. వారిని ఫయాజ్ బాషా (30) తండ్రి లేట్ మహబూబ్ బాషా, ఫరూక్‌బాషా(21) లేట్ మహ బూబాబాషా, కేతిరెడ్డి కాలనీ, దుంగవత్ నాగేంద్ర(23) తండ్రి లేట్ గోపాల్, ఇందిరమ్మ కాలనీకి ధర్మవరం టౌన్‌గా గుర్తించారు. వారి నుంచి అమ్మవారి ముఖ కవచం, రెండు తాళిబొట్లు, చెవి రింగు, మూడు మొబైల్ ఫోన్లు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. ఫయాజ్‌పై 13, ఫరూక్‌పై 10, నాగేంద్రపై 6 కేసులు ఉన్నట్లు తెలిపారు.

జగనన్న కాలనీకి దారిచూపండి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

జగనన్న కాలనీలో పెరిగిన ముళ్లపొదలు

మండల కేంద్రమైన బొమ్మనహాల్‌కు చెందిన నిరుపేదలకు సర్వే నెంబర్ 85-బి (జగనన్న కాలనీ)లో 200 ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఈ కాలనీకి వెళ్లడానికి సరైన మార్గం లేదు. ప్రస్తుతం రైతులు పొలాలకు వెళ్లే కాలిబాటలోనే రాకపోకలు సాగిస్తున్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని లారీల్లో తరలించాలం టే సరైన మార్గం లేకపోవడంతో కాలనీలో ఎలాంటి పనులు చేపట్టలేదని పట్టాలు పొందిన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలనీలో నీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపి వాహనాలు రాకపోకలు సాగించేలా రహదారి ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తే త్వరలోనే గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుంటామని లబ్ధిదారులు కోరుతున్నారు.

గూగూడు బ్రహ్మోత్సవాలపై సమావేశం

ప్రజాశక్తి-నార్పల

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవా లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని గూగూ డు గ్రామంలో జరగనున్న గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల పై బుధవారం డివిజన్ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే పద్మావతి సమీక్ష సమావేశం నిర్వహించా రు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకూ జరుగనున్నాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ శ్రీనివాసులు గూగూడు గ్రామాన్ని సందర్శించి పీర్లచావిడి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముం దు కుళ్లాయిస్వామి ముజావర్, ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ శింగనమల్ల సిఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డితో బ్రహ్మోత్సవాల సమయంలో నిర్వహించే బందోబస్తుపై చర్చించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు జేబు దొంగలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని సూచించారు.

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు

గుత్తి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసు లు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వాటర్ ప్లాంట్లను బుధవారం కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.రంగయ్యతో కలిసి సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే వాటర్ ప్లాంట్ల లోని తాగు నీటిని పరీక్షల కోసం సేకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లకు సంబంధించిన ఫుడ్ సేఫ్టీ అండ్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్సు, బయోలాజికల్ రిపోర్ట్, మున్సిపల్ ఎన్ఓసి, వాటర్ టెస్టింగ్, ఐఎస్‌బి సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించని వాటర్ ప్లాంట్లపై భారీ జరిమానా విధించి, సీజ్ చేస్తామని హెచ్చరించారు.

'యువగళం' పాదయాత్రలో జెసి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పట్టణ సిఐ ఆనందరావు మృతిపై టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో న్యాయనిపుణులతో చర్చించినట్లు జెసి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాలో సాగుతున్న లోకేష్ యువగళం పాదయాత్రలో బుధవారం జెసితో పాటు ఎస్వీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. పాదయాత్ర విరామ సమయంలో సిఐ ఆనందరావు ఆత్మహత్య విషయాన్ని లోకేష్‌కి వివరించడంతో పాటు అక్కడే న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలిపారు. ఇక వైసిపి కార్యకర్తలు మంగళవారం రాత్రి చేసిన దాడిలో గాయపడిన టిడిపి సీనియర్ నాయకుడు చింబిలి వెంకటరమణ, కార్యకర్తల ఆరోగ్య పరిస్థితుల గురించి లోకేష్ వారిని అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యే దీపక్ రెడ్డి ఉన్నారు.

లోకేష్‌తో జెసి ప్రభాకర్ రెడ్డి, రవీంద్రారెడ్డి

టిడిపి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

శింగనమల : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా బుధవారం జిల్లా తెలుగు యువత నాయకులు కాయల రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర ఇకపై కూడా దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అమర్‌నాథ్, కృష్ణ, సాయి, హర్ష, మురళి, వినోద్, కిరణ్, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు

వ్యాపార లక్ష్యాన్ని అధిగమించాలి

ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత

ప్రజాశక్తి-అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత

నిర్దేశించుకున్న వ్యాపార లక్ష్యం రూ. 2 వేల కోట్లను అధిగమించేందుకు సమిష్టి కృషి చేయాలని ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత తెలిపారు. నగరంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బుధవా రం ఆమె 2023-24 ఏడాదికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించే అంశంపై బ్యాంకు సీనియర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందు కోసం అన్ని రకాల సదు పాయాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం పాలకవర్గం, అధికారులు కొత్త స్కీంలను ప్రారంభించామని, అందులో భాగంగా 444 రోజుల నూతన డిపాజిట్ స్కీంలో భాగంగా ఖాతాదారులకు 7.70% వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో సీనియర్ సిటిజన్లకు 8.20% వడ్డీ ఇస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, డిజిఎం సుఖదేవబాబు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉనికి కోసం టిడిపి పాకులాట

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉనికిని కాపాడుకునేందుకు టిడిపి నాయకులు వైసిపిపై అసత్య ఆరోప ణలు చేస్తున్నారని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు ధ్వజమెత్తారు. విడపనకల్లు మండల పరిధి లోని గడేకల్ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ఓర్వలేక టిడిపి నాయకులు ఉనికిని కాపాడుకోవడానికి సచివాలయాల ముట్టడి కార్యక్రమాలు చేపడుతున్నా రన్నారు. ఈ నాలుగేళ్ల లో గడేకల్ గ్రామంలో సంక్షేమ పథకాలకు సంబం ధించి లబ్ధిదారుల అకౌంట్లోకి రూ. 28 వేల కోట్లు జమ చేశామన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ద్వారా రూ. 5 కోట్లకు పైనే రైతులకు నష్టపరిహారం చెల్లించిందన్నారు. టిడిపి నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే మీ ప్రభుత్వంలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇకనైనా పద్ధతి మార్చుకొని వైసిపి ప్రభుత్వాన్ని, జగన్‌ను చూసి ప్రజాసేవ ఎలా చేయాలో నేర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్ర మంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేసు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి హంపయ్య ఉమాశంకర్, మాల్యం ఎర్రన్న, జయరా ముడు, అశోక్‌రెడ్డి, శశిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-బెళుగుప్ప

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తుంద ని వైసిపి ప్రజాప్రతినిధులు తెలిపారు. మండల పరిధిలోని గంగవరం సర్పంచి రోజా అధ్యక్షతన, గుండ్లపల్లి సర్పంచి పురుషోత్తం అధ్యక్షతన బుధవారం ఆయా గ్రామాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, నోడల్ అధికారి శంకరయ్య, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, ఎంఈఓ మల్లారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, జేఈ సుధాకర్, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, పంచాయతీ సెక్రటరీ శ్రీరాములు, వైస్ ఎంపిపి రేఖమ్మ, ఎంపిటిసి ప్రసాద్, నాయకులు వెంకటరెడ్డి, నంజుండప్ప, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

'వాలంటీర్ పేరుతో యువత జీవితాలు నాశనం'

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వైసిపి ప్రభుత్వం వాలంటీర్ పేరుతో యువత జీవితాలు నాశనం చేస్తుందని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సాకే మురళీకృష్ణ ఆరోపించారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేయడంతో మైలపడిన ప్రదేశాన్ని బుధవా రం పార్టీ మండల అధ్యక్షుడు జి.ఎర్రిస్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాలతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా మురళీకష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఉద్యోగావకాశాలు కల్పించకుండా కేవలం రూ. 5 వేల గౌరవ వేతనంతో ఊడిగం చేయిస్తూ యువత బతుకులు నాశనం చేసిందెవరని ప్రశ్నించారు. కూల్చివేతల ప్రభుత్వం మరొకసారి అమానుషానికి ఒడిగట్టిందన్నారు. అమాయకులైన వాలం టీర్లను భయపెట్టి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు వక్రభాషాలు చెబుతూ దిష్టిబొమ్మలను దగ్ధం చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాలంటీర్ల ను అడ్డం పెట్టుకొని వైసిపి నాయకులు బాగుపడుతున్నారన్నారు. మీ జీవితాల్లో అభివృద్ధి లేకుండా చేస్తున్నది జగన్ ప్రభుత్వమే అని ఒకసారి ఆలోచించాలని వాలంటీర్లకు హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా, కార్యదర్శి జయమ్మ, మండల ప్రధాన కార్యదర్శి అరటి తాహిర్, చరణ్, మునీంద్ర, మన్నల పెద్దిరాజు, ఏకాంత, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై ఎజిఎంకు వినతి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి రైల్వే జంక్షన్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని కోరుతూ బుధవారం వైసిపి ఆధ్వర్యంలో దక్షిణ మధ్య రైల్వే ఎజిఎం ధనాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, నాయకులు పగడాల శ్రీనివాసులు, కెఎం.రంగనా యకులు మాట్లాడుతూ గతంలో గుత్తి రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లు ఆగేవని, ప్రస్తుతం వివిధ రైళ్లను దారి మళ్లించారన్నారు. గుత్తి రైల్వే జంక్షన్ గుండా రైళ్లు వెళ్లకపోవడంతో ప్రయాణికులు, నిరుద్యోగులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నిర్మలారెడ్డి, వెంకటేష్, ఆటో యూనియన్ నాయకు లు మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు

పుట్లూరు : తాడిపత్రి పెన్నహర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జడ్పి హైస్కూల్‌లో ప్రతిభావంత విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతిలో 516 మార్కులు సాధించిన పల్లవికి రూ. 8వేలు, శ్రావణి(496)కి రూ. 6వేలను పెన్నహర్ల సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, పెన్నహర్లు వీరా రెడ్డి, ఆదినారాయణస్వామి, కుళ్లాయిరెడ్డి, అశ్వర్థరెడ్డి, గోపాల్‌రెడ్డి, సేతు, పుల్లారెడ్డి, వెంకట్రామయ్య, హనుమంతరెడ్డి, రమణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

డెంగీ నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి గంగాధర ఆధ్వర్యంలో బుధవారం డెంగీ నివారణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. అనంతరం కొనకొండ్ల గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే శివరామిరెడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి రోజూ ప్రతి గ్రామంలో తప్పకుండా ఫీవర్ సర్వే చేయాలని మండల స్థాయి అధికారులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, వాలంటీర్లకు సూచించారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కార్యక్రమంలో ఉరవకొండ సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, ఎంపిడిఒ విజయ లలిత, వజ్రకరూరు మండల రెవెన్యూ అధికారి అనిల్‌కుమార్, ఈఒఆర్డి, మాజీ మండలాధ్యక్షుడు రామచంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎఎన్ఎం పద్మావతి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని శిద్దరాచెర్ల గ్రామపంచాయతీ గొల్లపల్లి గ్రామం అంగనవాడీ కేంద్రాన్ని బుధవారం సర్పంచి ఎస్.రామాంజనే యులు సందర్శించి పిల్లల హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అలాగే పిల్లలందరూ సక్రమంగా సెంటర్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని సూచించారు. అనంతరం పిల్లల బరువు, ఎత్తులను చూశారు. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ఇంటి దగ్గర కూడా పోషకాహారం అందించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు మంచి అలవాట్లు, ఆటపాటలు, చదువు నేర్పించాలన్నారు. ఆయన వెంట అంగన్వాడీ కార్యకర్త వెలుగు తణీత, హెల్పర్ దేవక్క, వాలంటీర్ పి.సుజాత, హరినాథ్ ఉన్నారు.

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ వద్ద బైఠాయించారు. దీంతో కమిషనర్ దివాకర్‌రెడ్డి కార్మికుల వద్దకు వచ్చి మున్సిపాలిటీలో అదనంగా 25 మంది కార్మికులు అవసరమని, వారిని విధుల్లోకి తీసుకునేందుకు అనుమతించాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు లేఖ రాశామని, అనుమతులు రాగానే పనిలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ధర్నా, రిలే దీక్షలను విరమించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE :GOOTY
I.A.No.81/2021 in O.S.No.151/2016
Between:
K.Obulesu ...**PETITIONER/PLAINTIFF**
V/S
Boreddy Dilip Kumar Reddy
...**RESPONDENT/DEFENDANT**
TO
Boreddy Dilip Kumar Reddy, S/O B. Lakshmi Narayana Reddy , Resident of Kristipadu village, Peddavadugur Mandalam, Anantapuramu District.
PUBLIC NOTICE TO RESPONDENT/DEFENDANT
పై అర్జీలో రెస్పాండెంట్‌కు ఎన్నిసార్లు నోటీసు పంపినను తీసుకొనక కాలయాపన చేయడం జరిగింది. అందువలన కోర్టువారు ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా రెస్పాండెంట్ అయిన నీవు 11/08/2023వ తేదిన హాజరు కావలెను. లేని యెడల నీ యందు పరోక్షంగా తీర్మానం చేయుదురని తెలపడం అయినది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఆర్.రామగోపాల్
అర్జీదారుని వకీలు న్యాయవాది గుత్తి

చేనేత కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సచివాలయంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఎం.గౌతమికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ఏర్పాటు, పెద్దపప్పూరు లోని కార్మికులకు 3 సెంట్ల స్థలంలో పక్కా గృహాలు, ఓటిఎస్ ద్వారా డబ్బులు కట్టిన వారికి రిజిస్ట్రేషన్, రామకోటి కాలనీకి తాగునీరు, చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం, జీఎస్టీ తొలగింపు, 11 రకాల రిజర్వేషన్ యాక్ట్ అమలు, పట్టు రాయితీ, గుర్తింపు కార్డులు, హెల్త్ స్కీమ్, ఇన్సూరెన్స్, తదితర డిమాం డ్లతో పాటు ధర్మవరం వ్యాపారులపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం రామచంద్ర, చలపతి, నాగసేన, నాగరాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-బెళుగుప్ప

సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, తదితర వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటిస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కార్తీకరెడ్డి సూచించారు. మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జడ్పి హైస్కూల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇళ్ల ముందు మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వారానికోసారి నీటి తొట్టెలను శుభ్రపరచాలన్నారు. మురికి నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ తిప్పేస్వామి, డాక్టర్ ప్రియాంక, హెచ్ఎం బాలాజీ, సూపర్‌వైజర్ వెంకటరమణ, వసంత, వైద్య సిబ్బంది రవికుమార్, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

ఎపిడి చెన్నకేశవులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎపిడి చెన్నకేశవులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎపిడి మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని, రోజూ 8వేల మందికి పైగా పనులకు హాజరవ్వాలని సూచించారు. డ్రై లాండ్ హార్టీకల్చర్ కింద మంజూరైన రైతులు మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ పని ప్రదేశం నుంచి రెండు ఫొటోలు తప్పనిసరిగా పంపాలన్నారు. కార్యక్రమంలో ఎపిడి భాగ్యలక్ష్మి, టిఎలు, ఎఫ్ఎలు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిన్ సెక్రటరీలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున

అడ్మిన్ సెక్రటరీ సచివాలయంలో ఉండాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

పటణంలోని అన్ని వార్డుల పరిధిలోని సచివాలయాల్లో ప్రతి అడ్మిన్ సెక్రటరీ ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం సచివాలయ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అడ్మిన్ సెక్రటరీ సచివాలయాల్లో సమయానికి ప్రజ లకు అందుబాటులో ఉండి వారి సమస్యలపై అర్జీలు తీసుకుని అవి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇతర సెక్రటరీలు, వాలంటీర్ల హాజరు పట్టికను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, జాబ్ ఛార్టు ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి నాసిర్ హుస్సేన్, సచివాలయాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.NO. 263/2019
బుశెట్టి రాజశేఖర్, S/o బుశెట్టి శ్రీరాములు, హిందూ, 50సం॥లు, గోల్డ్ బిజినెస్, డోర్‌నెం.11/338-1, మెయిన్ బజార్, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా. ...వాది
Vs
బయపురెడ్డి లక్ష్మినారాయణరెడ్డి, S/o కొండారెడ్డి, 52 సం॥లు, హిందూ, బిజినెస్, డోర్‌నెం.3-551, పుట్లూరు రోడ్డు, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా. ...ప్రతివాది
దావా సమను
పై నెంబరు దావాను వాది, ప్రతివాది అయిన మీ పైన ప్రోనోటు బాకీ వసూలు కోరి రాజశ్రీ పై కోర్టులో దావాను దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి దావాలో మీరు హాజరు అగుటకు గానూ 19/7/2023వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30 గం॥లకు ఆక్షేపణలు వున్న యెడల ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది : 19.07.2023
//By Order of Court//
C.GURAPPA
Advocate, PRODDATUR.